


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూలై 17, 2026 | సంపుటి : 2 | సంచిక : 275 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

♦ నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూలై16 :** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది.

2లో

### తెలంగాణలో ఆషాఢ

## బోనాల సందడి



♦ ప్రజలకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్,జూలై16 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



### పవన్ కళ్యాణ్‌కు గవర్నర్

## నజీర్ పరామర్శ

- ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా
- త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష

**హైదరాబాద్,జూలై16 :** కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు.

2లో

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'హైదరాబాద్

## ఈ ఛాంపియన్స్' యాజమాన్యం



**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి ని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజమాన్యం కలిసింది. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఈ ఛాంపియన్స్ జట్టు సభ్యులు ఉన్నారు. తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు. అనంతరం జట్టు సభ్యులకు చెక్కులను అందజేశారు.

**టీజీ 20 లీగ్‌కు మంచి ఆదరణ దక్కింది: సీఎం రేవంత్**

ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. టీజీ20 లీగ్‌కు అంతర్జాతీయ మ్యాచ్‌ల తరహాలో మంచి ఆదరణ దక్కిందన్నారు. "క్రికెట్‌లో యువత ఎదిగేందుకు ఈ లీగ్ బాగా ఉపయోగపడుతుంది. ఆటపై చూపిన కమిట్‌మెంట్ వల్లే సచిన్‌లాంటి వాళ్లు ఆ స్థాయికి ఎదిగారు. సంస్థలు మీ వెనుక నిలబడ్డాయి. క్రికెటర్లకు ఈ సంస్థలు వెయ్యి ఏనుగుల బలంతో పాటు ఎదగడానికి కావాల్సిన అన్నింటినీ ఇస్తాయి. గతంలో క్రికెటర్లకు ఇలాంటి సంస్థల అండ లభించలేదు. దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



2లో

### గోదావరి జలాలతో ఉమ్మడి

## ఖమ్మం సస్యశ్యామలం

♦ నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం
♦ ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా
♦ సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు
♦ ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై16 :** గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు.

2లో



## గోల్కొండలో బోనాల సందడి

- దప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాల
- గోల్కొండ అమ్మవారిని దర్శించుకున్న ఎంపి ఈటెల రాజేందర్

**హైదరాబాద్,జూలై16:** తెలంగాణలో బోనాల సందడి మొదలయ్యింది. హైదరాబాద్‌లో బోనాల జాతర గురువారం ప్రారంభం అయ్యింది.

## వర్షాభావంతో ప్రత్యామ్నాయా పంటల ప్రణాళిక

» రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యం
» కార్యాచరణ ప్రణాళికపై పుస్తక రూపంలో వివరాలు
» సచివాలయంలో ఆవిష్కరించిన మంత్రి తుమ్మల




2లో

**హైదరాబాద్,జూలై16 :** వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినోపై రాష్ట్ర తొలి శాస్త్రీయ కంటింజెన్సీ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాలు, జిల్లాల వారీగా వర్షపాతం లోటు వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు.

## ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

- సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్



మిగతాది 2లో

**హైదరాబాద్,జూలై16 :** 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### గోల్కొండ కోటలో ప్రారంభమైన

## ఆషాడ బోనాల ఉత్సవాలు

» అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
» కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
» వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ



**హైదరాబాద్,జూలై16 :** గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

మిగతాద్ది 2 లో

### సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో

## ఇస్లాం బోధన

♦ రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్
♦ టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
♦ ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,జూలై16 :** హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు.



2లో..

## వికలాంగ విద్యార్థుల సంక్షేమమే తొలి ప్రాధాన్యం

- దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ
- సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మిగతాది 2లో



మిగతాది 2లో

### బిఆర్ఎస్ మయాంలోనే

## ఎయిర్‌పోర్ట్ అనుమతులు

- మంత్రిగా కెటిఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి చర్చలు
- స్పష్టం చేసిన వరంగల్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు

**వరంగల్,జూలై16 :** మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించిన అనుమతులు, భూసేకరణ ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నిజాం కాలంలో నిర్మితమైన మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారని తెలిపారు.

# గోల్కొండలో బోనాల సందడి

మొదటి పేజీ తరువాయి
దప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాల నడుమ సంప్రదాయ వస్త్రాల్లో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయాలకు కదిలే తరుణం వచ్చేసింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలో ప్రారంభం అయ్యాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల కోసం.. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి పరిధిలోని సుమారు 3 వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆషాఢ మాస బోనాల పండుగ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నేత ఈటల రాజేందర్ గురువారం గోల్కొండ కోటలోని శ్రీశ్రీశ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని తెలంగాణ ప్రజలందరికీ ఆషాఢ మాస బోనాల శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని అన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సాంప్రదాయంలో వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఆషాఢ మాసంలో తెలంగాణ రాష్ట్రంలోనే తొలి బోనాన్ని కుమ్మర సమాజానికి చెందిన మహిళలు గోల్కొండ జగదంబ మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. గోల్కొండలో తొలి బోనం సమర్పించిన అనంతరం లష్కర్ బోనాలతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రతి
గల్లీ, ప్రతి ఇంట్లో బోనాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతుందని, ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోనూ బోనాల వేడుకలు వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఆచారం వందల సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలందరూ అమ్మవారికి బోనం సమర్పిస్తూ.. అమ్మా.. పిల్లలను, పెద్దలను, మమ్మల్ని చల్లగా చూడు.. సుఖసంతోషాలతో జీవించే భాగ్యం కలిగించమని ప్రార్థిస్తారని ఈటల అన్నారు. భూతల్లి కరుణతో వ్యవసాయం, వ్యాపారాలు సుభిక్షంగా సాగాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని భక్తులు మొక్కులు చెల్లిస్తారని చెప్పారు. గోల్కొండ బోనాల జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను సజీవంగా అందించే మహత్తర ఉత్సవమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కుమ్మర సోదరులు, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ పండుగను ఘనంగా నిర్వహించడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని అన్నారు. ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుఖశాంతులు, సస్యశ్యామలతతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

మొదటి పేజీ తరువాయి
తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్
హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వికలాంగ విద్యార్థుల సంక్షేమమే తొలి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి
రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం, ప్రభుత్వ దివ్యాంగుల వసతి గృహం, పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమైన మంత్రి, మూగ,చెవిటి విద్యార్థులు సంకేత భాష ద్వారా తమ సమస్యలను వివరించగా ఎంతో శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలన్నింటినీ సమగ్ర ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. ఖాళీ పోస్టుల వివరాలు, అవసరమైన బోధనా సిబ్బంది, ఇతర సౌకర్యాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సహాయ సంచాలకుడు, విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగ విద్యార్థుల విషయంలో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అనే మూడు అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని ఆహారం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, తరగతి గదులు, బోధన సౌకర్యాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగ విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా ప్రభుత్వానికి పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి
అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో
# ఇస్లాం బోధన

మొదటి పేజీ తరువాయి
ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.
బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

మొదటి పేజీ తరువాయి
పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

మొదటి పేజీ తరువాయి
హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రబ్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే
ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# బిఆర్ఎస్ హయాంలోనే ఎయిర్‌పోర్ట్ అనుమతులు

మొదటి పేజీ తరువాయి
ఉడాన్ పథకం కింద కూడా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించామని, 1.8 కిలోమీటర్ల రన్‌వేను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 3.8 కిలోమీటర్లకు విస్తరించేందుకు రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, మామునూరు ఎయిర్‌పోర్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 253 ఎకరాల భూసేకరణకు కేబినెట్ ఆమోదం లభించిందని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ కారణంగా నియామకాలు నిలిచిపోయాయని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం కూడా రూ.500 కోట్లతో భూసేకరణ చేపట్టామని పేర్కొంటూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, భూసేకరణకు అనుమతి ఇచ్చింది ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. దేశంలో అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ మామునూరు ఎయిర్‌పోర్టును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదని, మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వమే పునాది వేసిందని పేర్కొన్నారు.

# తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

మొదటి పేజీ తరువాయి
బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

## గోల్కొండ కోటలో ప్రారంభమైన
# ఆషాడ బోనాల ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి
బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# వర్షాభావంతో ప్రత్యామ్నాయా పంటల ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి
రెండు నెలల వాతావరణ అంచనాల ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. ఐఎండీ సమాచారంతో రోజువారీ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందజేస్తామని చెప్పారు. ఆయా పంట నష్టాల నివారణకు అన్ని శాఖల సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం వంటి ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ రూపొందించిన 'తెలంగాణ వ్యవసాయ అత్యవసర / ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక వానాకాలం-2026' పుస్తకాన్ని తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవడానికి, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడానికి, పంటల సంరక్షణ చర్యలను చేపట్టడానికి ఈ పుస్తకం సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ సమాచారం, వాతావరణ అంచనాలు, జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికలు, పంటల నిర్వహణ సూచనలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ పుస్తకం రైతులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భారత వాతావరణ శాఖ , భారత వ్యవసాయ పరిశోధన మండలి సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ పంటల పరిశోధన సంస్థ, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ , భారత నూనెగింజల పరిశోధన సంస్థ నీటిపారుదల, విద్యుత్, భూగర్భ జల శాఖల సాంకేతిక సహకారంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాత విశ్లేషణ, వాతావరణ అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితి, జలాశయాల నీటి లభ్యత, జిల్లా వారీ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, పంటల నిర్వహణ పద్ధతులు, తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల లభ్యత, రైతులకు అందించాల్సిన అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను సమగ్రంగా పొందుపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి,ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డదారుల్లో పదవుల పంపకం చేస్తున్న కాంగ్రెస్

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

ఇది ప్రజాస్వామ్య హత్య

- ఎన్నికలు నిర్వహించలేక అడ్డదారులు తొక్కుతున్న కాంగ్రెస్.
- రైతు సహకార సంఘాల ఎన్నికల నుంచి పారిపోతున్న అధికార కాంగ్రెస్.
- ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేకే రైతుల ఓటు చోరీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నామినేషన్ల నాటకం ఆడుతున్నదని బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ కు చెందిన గౌరారం జగన్ గౌడ్అన్నారు



తెలంగాణ రాష్ట్రంలో రైతు సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికలను పక్కనపెట్టి అడ్డదారుల్లో డైరెక్టర్లు, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను నియమించడం అత్యంత దుర్మార్గమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని బీజేపీ జిల్లా పార్టీ నాయకుడు జగన్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.
రైతుల ఓటుతో నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని హరించి, అధికారాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ దొడ్డిదారిన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు.
ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేక, ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నామినేషన్ల పేరుతో పదవుల పంపకానికి తెరలేపిందని విమర్శించారు.
రైతు సహకార సంఘాలు కాంగ్రెస్ పార్టీ రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, అవి రైతుల సంస్థలని గుర్తుంచుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
రైతుల హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న ఈ ప్రభుత్వానికి రైతాంగం తగిన గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు.

**వెంటనే ఈ అక్రమ నియామకాలను రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని రైతు సహకార సంఘాలకు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది.**

రైతులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం రోజురోజుకూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో తన పతనాన్ని తానే వేగవంతం చేసుకుంటోందని జగన్ గౌడ్ అన్నారు.

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెబుతారని బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్ అన్నారు.

# ట్యాంకర్ ఢీకొని బాలుడు మృతి



గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి
కొరుట్ల పట్టణ శివారులోని వేములవాడ రోడ్డులో గురువారం రోజున జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 ఏళ్ల బాలుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ రోడ్డుకు చెందిన మగ్గిడ్డి జస్వంత్(13) మగ్గిడి చాణక్యలు మోటార్ సైకిల్ పై వెళుతుండగా అదే మార్గంలో వచ్చిన డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వర్షపు నీటి సంరక్షణ పై మెట్‌పల్లిలో అవగాహన కార్యక్రమం



గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి
మెట్‌పల్లిలో గురువారం జల ప్రతిజ్ఞ' కార్యక్రమంలో భాగంగా సిడిఎంఏ అధికారి ఆదేశాల మేరకు 'క్యాచ్ ది రైన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ గుంతలు, రైన్వాటర్ హార్వెస్టింగ్ ఫిట్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి వర్షపు నీటి బొట్టును సంరక్షించడం, భూగర్భ జలాలను కాపాడటం, స్థిరమైన భవిష్యత్తు కోసం వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి వినియోగించడం ప్రాముఖ్యతను వివరించారు.

# సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై కేంద్రం స్పందించాలి:
## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

- దీక్ష కొనసాగుతున్న నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం
- నిరసనకారులతో వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్



కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 16
లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ,నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు నిరసనగా, పరీక్షా పత్రాల లీకేజీ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ సామాజిక పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్ చుక్ 19 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. జూన్ 20 నుండి కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతుండగా, జూన్ 28 నుండి సోనమ్ వాంగ్ చుంగ్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించి 19 రోజులు కావస్తున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. రోజు రోజుకి ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తూ బలహీనపడి ప్రాణానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. పార్లమెంటుకు కూతవేటు దూరంలో ఉన్న జంతర్మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యమకారులతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. 2011 లో అన్నా హజారే నిరవధిక నిరాహార దీక్ష చేస్తే 13 రోజులకే ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ స్పందించి లోక్పాల్ బిల్లు ఏర్పాటుకు అంగీకరించి నిరవధిక నిరాహార దీక్షను విరమింప చేయించడం జరిగిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్రను విడనాడి నిరసన కారులతో చర్చలు జరిపి వాంగ్ చుంగ్ నిరాహార దీక్ష విరమింపజేసి ప్రాణాలను కాపాడాలన్నారు. ఆయన ప్రాణానికి ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల ప్రజలు వాంగ్ చుంగ్ నిరవధిక నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని ప్రకటించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

# న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక:
## పింగిళి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి

- న్యాయమూర్తులు, న్యాయవాదుల సేవలు సమాజానికి ఆదర్శం
- అంతర్జాతీయ న్యాయ దినోత్సవం – జూలై 17 శుభాకాంక్షలు తెలిపిన కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పింగిళి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి

కరపత్రం ప్రతినిది బ్యూరో, జులై 17
అంతర్జాతీయ న్యాయ దినోత్సవం – జూలై 17 సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పింగిళి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, న్యాయ విద్యార్థులు, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల సంరక్షణ, సమాజంలో న్యాయం, సమానత్వం, శాంతి స్థాపనలో న్యాయవ్యవస్థ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, న్యాయవాదుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. న్యాయం ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, న్యాయపాలనను మరింత బలోపేతం చేయడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ సందర్భంగా దేశ న్యాయవ్యవస్థ మరింత బలోపేతం కావాలని, న్యాయం వేగవంతంగా ప్రతి పౌరుడికి చేరాలని ఆకాంక్షిస్తూ మరోసారి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, న్యాయ విద్యార్థులు, ప్రజలందరికీ అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డా. పుల్ల శ్రీనివాస్ - పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం


- కేయూలో సామాజిక న్యాయం, పరిశోధనకు ప్రాధాన్యం పెరగాలని ఆకాంక్ష
- కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డా. పుల్ల శ్రీనివాస్, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను సత్కరించిన టీఆర్ఎస్ వరంగల్ వెస్ట్ ఇన్‌చార్జి డా. పర్లపల్లి శ్రీశైలం



కరపత్రం ప్రతినిది బ్యూరో, జులై 16
కాకతీయ యూనివర్సిటీ అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పుల్ల శ్రీనివాస్‌ను, అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను టీఆర్ఎస్ వరంగల్ వెస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ అంబేద్కర్ స్టడీ సెంటర్‌కు డాక్టర్ పుల్ల శ్రీనివాస్‌ను జాయింట్ డైరెక్టర్‌గా నియమించడం అభినందనీయమని అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంబేద్కర్ ఆలోచనలను విద్యార్థులకు మరింత చేరువ చేస్తూ, అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పరిశోధన, అధ్యయన కేంద్రంగా తీర్చిదిద్దాలని డాక్టర్ పుల్ల శ్రీనివాస్‌కు ఆయన సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యా, సామాజిక పురోగతికి దోహదపడే విధంగా కేంద్రం కార్యాచరణ కొనసాగించాలని ఆకాంక్షించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన సేవలు సమాజానికి ఆదర్శమని కొనియాడుతూ, ఆయనను శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'అంతర్జాతీయ న్యాయ దినోత్సవ" శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

- న్యాయవాదులు న్యాయ వ్యవస్థకు వెన్నెముక..
- న్యాయవాదులు సమాజానికి న్యాయదీపికలు.. వారి సేవలు చిరస్మరణీయం




కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 16
అంతర్జాతీయ న్యాయ దినోత్సవం – జూలై 17 సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి న్యాయవాదులకు, న్యాయరంగంలో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు న్యాయపాలన (రూల్ ఆఫ్ లా) మూలస్తంభమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలకు అందించడంలో, అన్యాయానికి గురైన వారికి అండగా నిలవడంలో, సమాజంలో న్యాయం, సమానత్వం, ధర్మాన్ని పరిరక్షించడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమైందని కొనియాడారు. న్యాయవాదులు కేవలం కోర్టు వాదనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయసహాయం అందించడం, బలహీన వర్గాల హక్కులను కాపాడడం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విశేషంగా సేవలందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. సమాజంలో న్యాయం నిలవడానికి, ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం కావడానికి న్యాయవాదుల సేవలు ఎనలేనివని అన్నారు.
విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగ విలువలు, చట్టాల పట్ల గౌరవం, బాధ్యతాయుత పౌరసత్వం అలవర్చుకోవాలని సూచించారు. నైతిక విలువలు, క్రమశిక్షణ, న్యాయస్ఫూర్తితో ఎదిగే యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ తన హక్కులతో పాటు విధులను కూడా నిర్వర్తించినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం, సమాన న్యాయం నెలకొంటాయని తెలిపారు. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయరంగంలోని ప్రతి ఒక్కరి కృషి చిరస్మరణీయమని అన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయం, ధర్మం, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ సమాజానికి సేవలందిస్తున్న న్యాయవాదులందరికీ లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, వారు ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి ఆకాంక్షించారు.

# 'అంతర్జాతీయ న్యాయ దినోత్సవ" శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- మానవ హక్కుల పరిరక్షణతోనే ప్రజాస్వామ్యం బలోపేతం
- సామాజిక న్యాయం సాధనకు అందరూ కృషి చేయాలి

కరపత్రం ప్రతినిది బ్యూరో, జులై 16
అంతర్జాతీయ న్యాయ దినోత్సవం – జూలై 17 సందర్భంగా వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయ సిబ్బంది, న్యాయ విద్యార్థులకు మరియు ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. న్యాయం, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి చట్టం ముందు సమాన హక్కులు కల్పించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని ఎంపీ అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సామాజిక న్యాయం నెలకొనాలంటే రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించి ఆచరించాలని సూచించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, న్యాయ రక్షణ కల్పిస్తోందని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, న్యాయం అందరికీ అందుబాటులో ఉండే సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఎంపీ డా. కావ్య పిలుపునిచ్చారు. 'అంతర్జాతీయ న్యాయ దినోత్సవం" సందర్భంగా న్యాయం, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని కోరుతూ మరోసారి ప్రజలకు శుభాకాంక్షలు.. తెలిపారు.

## మేడ్చల్ పట్టణంలో వెల్దుర్తి మండలం మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి ఏర్పాటుచేసిన రామ్ రాజ్ కాటన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ సువాసినిరెడ్డి

**సరసమైన ధరలకు అందరికీ వస్త్రాలు అందుబాటులో ఉండే విధంగానే రామ్ రాజ్ కాటన్ షాపింగ్ మాల్ ఏర్పాటు చేశామని తెలిపిన వెల్దుర్తి మండల మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జూలై 16**
మేడ్చల్ పట్టణంలో గురువారం నాడువెల్దుర్తి మండల మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రాజ్ కాటన్ షాపింగ్ మాల్" ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి పాల్గొనారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులు స్వరూప నరేంద్రరెడ్డికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను రాజకీయంలోనే కాకుండావ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నామని. స్థానిక ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వారు పేర్కొన్నారు. తాను నూతనంగా నిర్వహించినటువంటి రామ్ రాజ్ కాటన్ షాపింగ్ మాల్ లో అన్ని రకాల వస్త్రాలు సరసమైన ధరలకు కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని నేటి సమాజంలో ప్రతి మానవునికి నిత్యవసర వస్తువు లో భాగంగా వస్త్రం ఎంతో ముఖ్యమని తినటానికి తిండి లేకుండా వస్త్రాలు లేనిదే మానవ జీవి బయటకు వెళ్లలేరని నేడు డబ్బులు ఉన్న ధనికుడు కూడా అయినా డబ్బు లేని అనామికుడికైనా తమకు తోచే విధంగా వస్త్రాలను కొనుగోలు చేసుకుంటున్నారని హిందూశాస్త్రీయ ప్రకారం స్త్రీ పురుషులకు సమసిద్ధకర మై నాటు వంటి వస్త్రా ఆలయాన్ని ప్రముఖ రాజకీయవేత వెల్దుర్తి మండల ఆపద్బాంధవుడు హనుమన్న గారి స్వరూపనరేందర్ రెడ్డి అని తాను వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామ వాస్తవ్యులు తాను చిన్ననాటి నుండి ఎన్నో అష్ట కష్టాలతో సుఖదుఃఖాలతో అంచలంచలుగా ఎదుగుతూ తాను అంటే ఏమిటో అని నిర్మించుకున్న మహానుభావుడని తాను రాజకీయంలోకి రావడం కూడా ఎంతో గర్వకారణమని వారికి తోచే విధంగా నిరుపేదలకు అండగా ఉంటూ ఎంతో కొంత నిరుపేదలకు సహాయ సహకారాలు చేసినటువంటి మహా మనిషి తాను నేడు ఈ స్థాయిలో ఉన్నాడు అంటే తన మంచితనమే తనకు రక్షణగా ఎల్లవేళలా ఉంటుందని వారు తెలియజేశారు వ్యాపారం పరంగానే కాకుండా తాను రాజకీయపరంగా కూడా మునుముందు రాను రోజుల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సకల దేవతలను కోరుకుంటున్నామని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారవేత్తలు స్థానికులు తదితరులు పాల్గొనారు





## అనుపురం ప్రమాదం తర్వాత అప్రమత్తమైన రవాణా శాఖ.. గూడ్స్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామం వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తర్వాత రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మహారాష్ట్రకు చెందిన వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న గూడ్స్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు కూలీలు మృతి చెందడంతో జిల్లాలో గూడ్స్ వాహనాల్లో కూలీల తరలింపుపై సిరిసిల్ల ఎంవీఐ వంశీధర్ గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. వరి నాట్ల సీజన్ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలను గూడ్స్ వాహనాల్లో తరలిస్తున్న వారిపై అధికారులు నిఘా పెంచారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లి మండలం వెంకట్రావుపల్లె వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కూలీలను తరలిస్తున్న ఓ గూడ్స్ వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం సమీపంలోని పొలాల్లో వరి నాట్లు వేస్తున్న కూలీలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను గూడ్స్ వాహనాల్లో తరలించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాపాయానికి దారితీస్తుందని వివరించారు. నాట్ల పనులకు వెళ్లే కూలీలు తప్పనిసరిగా ప్యాసింజర్ వాహనాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కూలీలను గూడ్స్ వాహనాల్లో తరలించే వాహన యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎంవీఐ హెచ్చరించారు.

## హుజురాబాద్ అభివృద్ధిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో వొడితల ప్రణవ్ భేటీ..

**అంబేద్కర్ భవనం, దళిత బంధు, సంక్షేమ పాఠశాలల నిధులపై వినతి**

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్: జూలై 16**
హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, దళిత సంక్షేమం, వెనకబడిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవనానికి గత ప్రభుత్వ హయాంలో పరిపాలనా అనుమతులు ఇచ్చినా, నిధుల కొరతతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ప్రణవ్ వివరించారు. భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అదేవిధంగా, దళిత బంధు పథకం గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించినట్లు, త్వరలోనే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మరోవైపు హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కూడా ప్రణవ్ కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తానని వొడితల ప్రణవ్ తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా వినతులను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి



**మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మం చౌదరి**
**ఆసుపత్రిలో బ్రహ్మం చౌదరిని పరామర్శించిన ఎమ్మెల్యే యరపతినేని, యువనేత నిఖిల్**

**పిడుగురాళ్ల, (కరపత్రం ప్రతినిధి జూలై 16 :**
బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి ని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరి కుటుంబసభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య చికిత్స గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బ్రహ్మం చౌదరి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని వైద్య బృందం తెలిపింది. బ్రహ్మం చౌదరి త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో వస్తారని ఆకాంక్షిస్తూ, ఆ భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్ తెలిపారు.

## అందోలు టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బాలయ్య

**-పటాకులతో మార్మోగిన మండల కేంద్రం**
**-టిఆర్ఎస్ అభ్యర్థి బాలయ్య కు ఘన స్వాగతం**

**కరపత్రం ప్రతినిధి అందోలు (జులై 16)**
సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గం జోగిపేట పట్టన కేంద్రంలో హనుమాన్ చౌరస్తా వద్ద అసెంబ్లీ అభ్యర్థిగా నియమితులైన మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ యం.బాలయ్య కు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పటాకులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. జై టిఆర్ఎస్ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ. అందోలు అసెంబ్లీ అభ్యర్థిగా నియమించినందుకు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు



కవితకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు. మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి. ఖలీల్, నారాయణ, నర్సింలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి శ్రీధర్ బాబు

**టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులతో భేటీ.. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని హామీ**


**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 16:**
రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మంత్రి శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రూపొందించిన "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ"లను మంత్రికి అందజేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ అంశాలను ప్రతినిధి బృందం మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయం వద్ద 150 మందికి అన్నదానం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం రాజన్న ఆలయం వద్ద 150 మంది అన్నార్తులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం ట్రస్ట్ చేపడుతున్న నిరంతర అన్నదాన సేవలో 1923వ రోజుకు చేరుకుంది. పలువురు దాతలు పుట్టినరోజులు, జ్ఞాపకార్థం, శాశ్వత దాతలుగా సహకరించగా, ట్రస్ట్ సభ్యులు, దాతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్ట్ నిర్వాహకులను లేదా 92469 39388 నంబర్‌లో సంప్రదించాలని మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వొడ్యాల వేణు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, నక్క వేణు, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, వంగల శ్రీధర్, గొట్టం శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ నిశిత తదితరులు పాల్గొన్నారు